

• ఆచంట : ఆచంటేశ్వరుడి రథోత్సవం



• పాలకొల్లు : క్షీరా రామలింగేశ్వరుడు



• భీమవరం : సోమేశ్వరుడు



• పట్టిసీమ : వీరేశ్వరుడు



• వీరంపాలెం : మహా శివలింగం



హరోంహర

హరహర మహాదేవ శంభో శంకరా.. ఓం నమఃశివాయ అంటూ భక్తుల నామస్మరణతో ప్రసిద్ధ శైవక్షేత్రాలు మార్మోగాయి. మహాశివరాత్రి పర్వదినం శుక్రవారం తెల్లవారు జాము నుంచే ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పంచారామ క్షేత్రాలైన పాలకొల్లు క్షీరా రామలింగేశ్వరుడు, భీమవరం సోమేశ్వరుడు, పట్టిసీమ వీరేశ్వరుడు, వీరంపాలెం స్ఫటిక లింగం, బలివే రామలింగేశ్వరుడు, ఆచంట ఆచంటేశ్వరుడు, కలిదిండి పాతాళ భోగేశ్వరస్వామి తదితర శైవ క్షేత్రాల్లో ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిగాయి. లక్షలాది మంది భక్తులు ఆయా ఆలయాల్లో స్వామిని దర్శించుకున్నారు. 7లో..

ఓట్ల కోసం వలంటీర్ల వల

- లోపాయికారిగా ఎన్నికల ప్రచారం
- ప్రభుత్వానికి కృతజ్ఞత చూపించాలని విన్నపం
- సర్వేలతోనూ సేకరిస్తున్న సమాచారం

• ఆకివీడు పట్టణ పరిధిలో వలంటీర్లు ఇంటింటికి తిరుగుతూ మీరు ఎవరికి, ఏ పార్టీకి ఓటు వేస్తారు ? అంటూ తమ పరిధిలోని 50 ఇళ్లకు వెళ్లి సర్వే చేస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యేలోపు మూడు రోజుల్లో సర్వే పూర్తి చేసేలా వారికి ఆదేశాలు జారీ చేశారు.



భీమవరం మార్చి 8: రాష్ట్ర ప్రభుత్వం వలంటీర్లను పార్టీ కార్యక్రమాల్లో ఉపయోగిస్తూ.. ప్రచారం చేయిస్తోంది. సచివాలయం కార్యదర్శి ఆ దిశగా వలంటీర్లకు ఆదేశాలు జారీ చేశారు. సంక్షేమ ఫలాలు అందుకున్న వారింటికి వెళ్లి వైసీపీపై కృతజ్ఞతలు చూపించాలని వలంటీర్లకు సూచించారు. ఏ పార్టీకి ఓటు వేస్తారో తెలుసుకోవాలని దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వం వేతనాలు ఇస్తూ వలంటీర్లను ఇలా వైసీపీ ప్రచారానికి ఉపయోగించుకోవడం విమర్శలకు దారి తీస్తున్నది. కొన్నిచోట్ల సర్వేలు చేస్తున్నారు. వైసీపీకి ఓటు వేయమంటూ చెప్పిన ఓటర్ల వివరాలను ఆ పార్టీ నాయకులకు చేరవేస్తున్నారు. సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఫోన్ నెంబర్లు అందిస్తున్నారు. ఈ విధంగా వలంటీర్లు వైసీపీ కార్యకర్తలుగా మారిపోయారు. ఉండి నియోజకవర్గం సర్వేను నిర్వహించి వైసీపీకి నివేదికలు ఇస్తున్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో వలంటీర్లు లబ్ధిదారులు ఇళ్లకు వెళుతున్నారు. సంక్షేమ పథకాలు సంతృప్తినిచ్చాయా అని అడుగుతూనే వైసీపీకి కృతజ్ఞత చూపాలని సూచిస్తున్నారు. లబ్ధిదారుల నుంచి వ్యతిరేకత వస్తుందన్న ఉద్దేశంతో కొందరు వలంటీర్లు కేవలం ఫొటోలు దిగి వైసీపీకి నివేదిక ఇచ్చేశారు. మొత్తం మీద వలంటీర్ల వ్యవస్థను వైసీపీ ప్రభుత్వం తమ పార్టీ ఎన్నికల ప్రచారానికి వినియోగించుకుంటున్నది. ప్రజలు చెల్లించే పన్నులను సంక్షేమ రూపంలో తిరిగి ప్రజలకు అందిస్తున్నది. వలంటీర్లకు ప్రజాధనాన్ని జీతాలుగా ఇస్తున్నారు. అటువంటి వారిని ఈ సమయంలో పార్టీ కార్యక్రమాలకు, ప్రచారానికి వినియోగించడంపై ప్రతిపక్షాలు నిలదీస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా వలంటీర్లు ఈ ప్రచారంలో నిమగ్నమయ్యారు. మరోవైపు పార్టీపై ప్రతికూల పరిస్థితులను అంచనా వేసేందుకు తమకనకూలంగా ఓటర్లను మలుచుకునేందుకు వలంటీర్లు సర్వే నివేదిక సర్వే ఉపయోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఇప్పటికే కులాల వారీగా ఓటర్ల వివరాలను వలంటీర్లు సేకరించారు. తాజాగా పార్టీలపరంగా ఓటర్ల సమాచారాన్ని సేకరించే పనిలో పడ్డారు. గ్రామాలలో పట్టణాలలో గుట్టుచప్పుడు కాకుండా వలంటీర్లు సర్వే చేపడతున్నారు. ఎన్నికల విధులకు వలంటీర్లు దూరంగా ఉండాలని ఎన్నికల సంఘం ఆదేశించినా వైసీపీ ప్రభుత్వానికి పట్టడం లేదు. సీఎం జగన్మోహనరెడ్డి వలంటీర్లను పార్టీ కార్యకర్తలుగా అభివర్ణించారు. ప్రజాధనాన్ని వినియోగిస్తూ ప్రభుత్వ సొమ్మును వేతనాలుగా మంజూరు చేస్తూ వాలంటీర్లను పార్టీ కార్యకర్తలుగా చెప్పుకుంటున్నార సరే, జిల్లా ఎన్నికల అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లి వెత్తుతున్నాయి. సచివాలయాల్లోని ఉద్యోగులే వలంటీర్లను ప్రోత్సహిస్తూ దిశా నిర్దేశం చేస్తున్నా, జిల్లా ఎన్నికల అధికారులు ఏం చేయలేని పరిస్థితి నెలకొంది.



ఉమ్మడిగా గెలవాలి

రాజకీయ సంగ్రామంలో అధికార వైసీపీని మట్టి కరిపించే దిశగా మిగతా పక్షాలు కూటమిగా కత్తులు నూరుతున్నాయి. సీట్ల సర్దుబాటుకు సుదీర్ఘ కసరత్తు చేస్తున్నాయి. పరస్పర సమన్వయంలో భాగంగా కొందరికి సీటు గల్లంతైనా అలాంటి నేతలతో టీడీపీ అధినేత చంద్రబాబు నేరుగా సంభాషిస్తున్నారు. జనసేనలోనూ కొంత జోష్ కనబడుతోంది. తాము ఆశించినట్లుగానే సీట్ల ఖరారు ఖాయంగా మారడంతో ఆ దిశగా రంగంలోకి దిగేందుకు సేన సిద్ధమవుతోంది. అది నుంచి కొంత అటూ ఇటుగా వున్న కమలం ఇకపై జనసేన-టీడీపీ కూటమితో జత కట్టేందుకు వీలుగా సీట్ల సర్దుబాటుకు దిగుతోంది.

(ఏలూరు - ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

వైసీపీని తరిమేయాలి

- సీట్లు రాకపోయినా బాధపడకండి.. మీ భవిష్యత్ నేను చూసుకుంటా
- ఏ కష్టం రానీయను.. పలువురి ఇన్‌చార్జ్‌లతో చంద్రబాబు సంభాషణ
- కమలంతో సీట్ల సర్దుబాటు యత్నాలు.. సేనకు దాదాపు రూట్ క్లియర్

కొన్నాళ్ల క్రితమే తెలుగుదేశం-జనసేన కూటమిగా ఏర్పడి రాజకీయ క్షేత్రంలో అధికార వైసీపీని దెబ్బ తీసేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేసింది. ఎవరెన్ని స్థానాల్లో పోటీ చేయాలో చర్చించి ఏలూరు, నరసాపురం లోక్‌సభా స్థానాల్లో టీడీపీ సీట్లను ప్రకటించింది. ఇపుడు బీజేపీ జత కట్టడం ఆ మేరకు సీట్ల సంఖ్య, ఎక్కడెక్కడ కేటాయించాలనే దానిపై రెండు రోజులుగా సుదీర్ఘ చర్చ సాగుతోంది. జనసేనకు కేటాయిస్తున్న స్థానాల్లో సుదీర్ఘకాలంగా టీడీపీ పటిష్టత కోసం పనిచేస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లకు కొంత భరోసా ఇచ్చే క్రమంలో టీడీపీ అధిష్టానం ఒకడుగు ముందుకేసింది. ఇంతకుముందే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు కొందరితో ముఖాముఖీ మాట్లాడారు. రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపు కోసం అధినేత చంద్రబాబు కొన్ని నిర్ణయాలు తీసుకుంటున్నారని, వీటిలో భాగంగానే జనసేనకు కేటాయిస్తున్న స్థానాల్లోనూ టీడీపీ ఉమ్మడిగా బాధ్యతలు తీసుకుంటున్నదని, మీ భవిష్యత్ విషయంలో పార్టీ కీలక నిర్ణయం తీసుకోబోతోందని కొందరిని సముదాయించారు. తాజాగా బీజేపీతో సంప్రదింపుల కోసం ఢిల్లీలో బస చేసిన పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నియోజకవర్గ ఇన్‌చార్జిలు కొందరితో సంభాషించారు. ఉంగుటూరు టీడీపీ టికెట్ ఆశించడమే కాకుండా ఏలూరు జిల్లా పార్టీ అధ్యక్ష బాధ్యతలను నిర్వర్తిస్తున్న మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులుతో శుక్రవారం చంద్రబాబు సంభాషించారు. నియోజకవర్గ పరిస్థితులను ఆరా తీశారు. 'భయం లేదు.. మీ భవిష్యత్ విషయంలో అంతా నేను చూసుకుంటాను' అని గన్నికి చంద్రబాబు భరోసా ఇచ్చారు. టీడీపీ-జనసేన బంధం గెలుపు బంధమని ఉమ్మడి కార్యాచరణలో ముందుకెళ్లాల్సిందిగా కోరారు. టీడీపీ కేడర్ తమ నేత గన్ని వీరాంజనేయులుకు స్థానం లేకుండా పోయిందని అసంతృప్తితో వున్న నేపథ్యంలోనే చంద్రబాబు ఫోన్ చేసి మాట్లాడడంతో కొంత సర్దుబాటుకు వచ్చే అవకాశం ఉంది. ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గమైన పోలవరం జనసేనకే ఖాయమైంది. ఆ నియోజకవర్గంలో ఇప్పటి వరకు చెమటోడ్చిన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బొరగం శ్రీనివాస్‌తోనూ చంద్రబాబు సంభాషించి ఆయనకు తగిన హామీ ఇచ్చినట్లు సమాచారం. నియోజకవర్గం భారీగా విస్తరించి వున్న పోలవరంలో సమర్థవంతంగా పనిచేశారని, రాజకీయ సమీకరణాల నేపథ్యంలో తాజా పరిస్థితులు అర్థం చేసుకోవాలని, జనసేన గెలుపునకు టీడీపీ కేడర్ పూర్తిగా సహకరించాలని బొరగంను కోరారు. రాజకీయ చైతన్యం కలిగిన నియోజకవర్గం తాడేపల్లిగూడెంలోనూ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వలవల బాబ్జీతో చంద్రబాబు మాట్లాడారు. నరసాపురంలో పరిస్థితిని సర్దుబాటు చేసేందుకు చాన్నాళ్లుగా, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా వున్న పొత్తూరి రామరాజుతోనూ ఢిల్లీ నుంచి చంద్రబాబు సంభాషించారు. దీంతో తెలుగుదేశం పార్టీ పక్షాన తెలుగు సైన్యాన్ని పూర్తిగా సమాయత్తపరచడం, ఇంకోవైపు పొత్తు ధర్మాన్ని కాపాడడం, సమాంతరంగా ఇరు పార్టీల అభ్యర్థులు వచ్చే ఎన్నికల్లో ఘన విజయం సాధించే దిశగా తెలుగుదేశం అధినేత చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు.

• భీమవరంలో జనసేనాధిపతి పవన్ పోటీ చేస్తే సరేసరి.. లేకుంటే ఆ స్థానాన్ని తమకే కేటాయించాల్సిందిగా బీజేపీ కోరినట్లు సమాచారం.

• బీజేపీ నరసాపురం లోక్‌సభ స్థానంతోపాటు, ఈ పరిధిలో వున్న భీమవరం, ఉండి, నరసాపురం అసెంబ్లీ స్థానాలను ఆశిస్తోంది.

కమలం కసరత్తు..

జనసేన-టీడీపీ కూటమితో జతకట్టేందుకు భారతీయ జనతా పార్టీ భారీగా సీట్లను కేటాయించాల్సిందిగా ప్రతిపాదిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే అసెంబ్లీ సీట్ల వ్యవహారంలో తెలుగుదేశం-జనసేన పరస్పర మద్దతుతో ఎక్కడా తగాదా, విభేదాల్లేకుండా సమన్వయంతో ముందుకెళ్తున్నాయి. బీజేపీతో జత కలిసిన తర్వాతే తాను పోటీ చేసే స్థానాలు ప్రకటించాలని జనసేన భావిస్తోంది. అందుకే తొలి జాబితాలో టీడీపీ తన అభ్యర్థులను ప్రకటించింది తప్ప, జనసేన తన కోటాలో భాగంగా అనేక స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి వున్నా కాస్త జాప్యం చేసింది. ఈ తరుణంలో బీజేపీ నరసాపురం లోక్‌సభ స్థానంతోపాటు, ఈ పరిధిలో వున్న భీమవరం, ఉండి, నరసాపురం అసెంబ్లీ స్థానాలను ఆశిస్తోంది.

ఢిల్లీలో బీజేపీ బాధ్యులు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, జాతీయ అధ్యక్షులు నడ్డాతో చర్చించారు. ఈలోపు నరసాపురం లోక్‌సభా స్థానం నుంచి పోటీ చేసేందుకు రఘురామకృష్ణంరాజు సిద్ధంగా వుండడం, ఈ స్థానానికి అదనంగా అసెంబ్లీ స్థానాలు ఆశించడం ఇపుడు హాట్ టాపిక్‌గా మారింది. 2014లో ఎన్నికల్లో తాడేపల్లిగూడెం నుంచి పైడికొండల మాణిక్యాలరావు గెలుపొందారు. ఈ నేపథ్యంలోనే బీజేపీ తాము ఎన్ని స్థానాలను ఆశిస్తున్నామో వాటినే యధావిధిగా టీడీపీ అధినేత, జనసేన అధ్యక్షుడికి ప్రతిపాదించారు. ఇంకోవైపు అభ్యర్థుల విషయంలో కొందరు అభిప్రాయసేకరణ చేస్తున్నారు. బీజేపీ అధికారికంగా ధ్రువీకరించకపోయినా ఈ సేకరణలో భూపతిరాజు శ్రీనివాసవర్మ, దివంగత కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి అభ్యర్థిత్వాలపైన ఆరా తీశారు.

మరోవైపు ఏలూరు లోక్‌సభా స్థానం పరిధిలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి(తపన చౌదరి)తోపాటు మాజీ ఎంపీ కావూరి సాంబశివరావు తనయుడు కావూరి భాస్కర్, మాజీ ఎంపీ సుజనాచౌదరి పేర్లు చర్చకొచ్చినట్లు చెబుతున్నారు. వీరిలో తపన చౌదరి ఏలూరు సీటు తనకే దక్కుతుందని ఇప్పటికీ పూర్తి విశ్వాసంతో వున్నారు. ఏలూరు జిల్లా కైకలూరు స్థానాన్ని బీజేపీ చాన్నాళ్లుగా ఆశిస్తోంది, ఇదే ప్రతిపాదన ఆ పార్టీ జాబితాలో వున్నట్లు చెబుతున్నారు. సీట్ల ఖరారుపై శనివారం నాటికి పూర్తి క్లారిటీ రానుంది.

చెరువులు స్వాహా

- ఆకివీడులో ఆక్రమణలు..
- తాగునీటి సమస్యలతో ప్రజలు



తాగునీటి కోసం ట్యాంకర్ వద్ద క్యూ

ఆకివీడు, మార్చి 8 : ఆకివీడు నగర పంచాయతీ పరిధిలో మంచినీటి చెరువులు ఆక్రమణకు గురవుతున్నా అధికారులు, పాలకవర్గం ఎటువంటి చర్యలు తీసుకోలేదు. పట్టణ పరిధిలో 50 వేల జనాభాకు వాడుకలో ఉన్న భుజబలరాయుడు స్టోరేజ్ ట్యాంక్, ఆనాల, గాలిబ్, మంచినీటి చెరువుల నుంచి తాగు నీటిని సరఫరా చేస్తున్నారు. ఆనాల, గాలిబ్, ధర్మాపురం అగ్రహారంలోని మంచినీటి చెరువులు ఆక్రమణకు గురయ్యాయి. దొరగారి కొండయ్య, తురక చాకలి చెరువులు ఆక్రమణలకు గురై పూర్తిగా పూడుకుపోయాయి. రంగయ్య చెరువును పూడ్చి ఆర్టీసీ బస్టాండ్, గ్రామ చావిడి, పార్కుతోపాటు కొందరికి పట్టాలిచ్చారు. తుమ్మల చెరువు పూడ్చి తహసీల్దార్, అగ్నిమాపక శాఖ కార్యాలయాలు, ప్రభుత్వాస్పత్రి, వాటర్ ట్యాంక్, అనధికార డంపింగ్‌తోపాటు కొంత మందికి పట్టాలు ఇచ్చారు. జంగాల చెరువు పూడ్చి స్థలంలో స్కూల్, చర్చి నిర్మాణాలు జరిగాయి, కల్యాణ మండపానికి స్థలం ఇచ్చారు. దోభీ ఘాట్ పూడ్చి గంగానమ్మ గుడి నిర్మాణం చేయగా యూపీహెచ్‌సీ నిర్మాణం జరుగుతోంది. సంఘం చెరువు ఆక్రమణకు గురైంది. మాదివాడలో రాళ్ళ చెరువు రజకులకు, రైతులు పశువులు కడుక్కోనేందుకు ఇచ్చారు. పట్టణ పరిధిలో పలుచోట్ల ఫిల్టర్ బెడ్‌లు, సంపుల సమస్యలున్నాయి. ఇసుక మార్చకపోతుండడంతో తాగు నీరు దుర్వాసన వస్తున్నాయి. కొన్ని ప్రాంతాలలో ట్యాంకు నిర్మిస్తే వేసవిలో మంచినీటి సమస్య తలెత్తదు.

ఆక్రమణలకు గురై గుర్రపు డెక్క, కిక్కిసతో పూడుకుపోయిన కొండయ్య మంచినీటి చెరువు



మేం ఏమంటామంటే..

• పట్టణ పరిధిలో ఏడాది పొడవునా కొన్ని ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఫిల్టర్ బెడ్‌లు బాలేదు. ఇసుక మార్చడం లేదు. కొన్ని ట్యాంకులు నిర్మిస్తే నీటి సమస్య తీరుతుంది.
■ దాసరి సోమరాజు, ఆకివీడు

• నగర పంచాయతీగా వర్గోన్నతి చెంది నాలుగేళ్లు దాటుతున్నా ఇన్‌చార్జి అధికారులే విధులు నిర్వహించడంతో అభివృద్ధి కుంటుపడుతోంది. పాలక వర్గం ఏర్పడి 27 నెలలు కావొస్తున్నా పాలన గాడిలో పడలేదు. ఆకివీడుకు హోదా మారింది తప్ప.. అభివృద్ధి లేదు.
■ గొంట్లా గణపతి, మాజీ సర్పంచ్, ఆకివీడు

• భూసర్వే వల్ల ఆక్రమణలు కొన్ని బయటపడుతున్నాయి. నగర పంచాయతీగా ఏర్పడడంతో పట్టణ పరిధిలో సర్వే చేయించి ఆక్రమణలు స్వాధీనం చేసుకుంటాం. అభివృద్ధికి అందరూ సహకరించాలి.
■ కృష్ణమోహన్, నగర పంచాయతీ కమిషనర్, ఆకివీడు

ఇక్కడ ఇల్లు ఎలా కట్టాలి ?



వీరవాసరం మండలం అండలూరులో ముంపునకు గురైన జగనన్న ఇంటి స్థలంలో టీడీపీ, జనసేన నేతలు

వీరవాసరం, మార్చి 8 : అండలూరులో అర్హులైన లబ్ధిదారులకు ఇంటిస్థలాలను కేటాయిం చేందుకు 1.33 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. దీనిని లే అవుట్ చేసి 40 మంది లబ్ధిదారులకు ఇచ్చారు. వీటిని లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసేందుకు అధికారులు సిద్ధం చేశారు. ఈ స్థలం జీఅండ్‌వి కెనాల్, బ్రాంచి కెనాల్ మధ్యలో ఉండటం వలన నీటి ముంపునకు గురవుతోంది. ముంపునకు గురైన స్థలంలో ఇంటి నిర్మాణాలు ఎలా చేసుకోవాలంటూ పలువురు లబ్ధిదారులు నిరాకరించారు. అయినప్పటికీ ఇటీవల రిజిస్ట్రేషన్లను అధికారులు పూర్తిచేశారు. లబ్ధిదారులు ఆందోళన చేయటంతో టీడీపీ, జనసేన నాయకులు ఈ స్థలాన్ని పరిశీలించారు. యుద్ధప్రాతిపదికన నివాసయోగ్యం కాని స్థలాన్ని కొనుగోలు చేసి నిధులు దుర్వినియోగం చేశారని, లబ్ధిదారులు వద్దన్నా అదే స్థలాల్లో ఇంటి నిర్మాణాలు చేయాలని వత్తిడి చేయటం ఎంత వరకూ సమంజసం అని ఎంపీపీ వీరవల్లి దుర్గా భవాని చంద్రశేఖర్ ప్రశ్నించారు. లబ్ధిదారులకు నివాసయోగ్యమైన భూమిలో రెండు సెంట్ల చొప్పున ఇంటి స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించాలని కోరారు.

నేటి నుంచి ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 8 : ఇంటర్మీడియట్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియ శనివారం నుంచి ప్రారంభమవుతోంది. ఏలూరు కోటదిబ్బలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్పాట్ వాల్యూయేషన్ క్యాంపులో తొలుత సంస్కృతం జవాబుపత్రాల మూల్యాంకనాన్ని చేపట్టనున్నారు. సంఖ్యాపరంగా ఈ సబ్జెక్టు జవాబుపత్రాలు ఎక్కువగా ఉండడంతో ముందుగా సంస్కృతం నుంచి ప్రారంభిస్తున్నారు. పూర్తిస్థాయి స్పాట్ వాల్యూయేషన్‌ను ఈ నెల 16 నుంచి చేపట్టడానికి నిర్ణయించారు. కాగా ఇంటర్ ప్రధాన పరీక్షలు 15వ తేదీతో ముగియనున్నాయి.

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పీడీ పోస్టుల భర్తీకి పదోన్నతులు

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 8: జిల్లా పరిషత్, గవర్నమెంట్ హైస్కూళ్లలో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ కేడర్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లను ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో జూనియర్ లెక్చరర్ కేడర్‌లో ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లుగా పదోన్నతిపై నియమించనున్నారు. ఈ మేరకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని సంబంధిత అర్హుల వివరాలతో ప్రతిపాదనలను పంపాలని ఉత్తర్వులు జారీ అయినట్లు డెమొక్రటిక్ పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. డిగ్రీ, ఎంపీఈడీ కోర్సులను 50 శాతం మార్కులతో పూర్తిచేసి కనీసం రెండేళ్ల సర్వీసువున్న వ్యాయామోపాధ్యాయులు పదోన్నతికి అర్హులన్నారు.

రెండు బైక్‌లు ఢీ.. ముగ్గురి మృతి

- మరో యువకుడికి తీవ్ర గాయాలు.. 7లో




పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి, భీమవరం సోమేశ్వరస్వామి ఆలయంలో భక్తులు




ఆచంటేశ్వరునికి పాలభిషేకం, వీరంపాలెం శివాలయంలో భక్తుల క్యూ



పట్టిసీమ వీరేశ్వరస్వామి ఆలయంలో భక్తులు

మార్మోగిన శివనామస్మరణ

- భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి పూజలు
- శివాలయాలు కిటకిట

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని శివాలయాల్లో శుక్రవారం మహాశివరాత్రి పూజలు భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాల్లో శివనామ స్మరణ మార్మోగింది. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాల వద్ద క్యూ కట్టారు. ఆయా ఆలయాల్లో స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో

పాలకొల్లు టౌన్, మార్చి 8 : పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలకు భక్తులు పోటెత్తారు. శుక్రవారం వేకువ జామునుంచి ఆలయ అర్చకులు మంత్రోచ్ఛరణలతో అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మార్మోగింది. యాత్రికులు, భక్తులతో ఆలయం కిటకి టలాడింది. మహిళలు సామూహిక వ్రతం, కుంకుమ పూజలు నిర్వహించారు. స్థానిక స్వచ్ఛంద సంస్థలు భక్తులకు బాదంపాలు, మజ్జిగ, తాగునీరు, ప్రసా దాలను పంపిణీ చేశారు. దేవస్థానం ఛైర్మన్ కోరాడ శ్రీనివాస్, ఈవో యాళ్ల సూర్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గునుపూడి సోమేశ్వరాలయంలో..

భీమవరంటౌన్, మార్చి 8 : పంచారామ క్షేత్రమైన గును పూడి సోమేశ్వరస్వామిని దర్శించుకునేందుకు భక్తులు క్యూట్టడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. తెల్లవారుజామున ఆలయ అర్చకులు కందుకూరి సోంబాబు, చెరుకూరి రామకృష్ణ ఆధ్వర్యంలో స్వామికి అభిషేకాలు నిర్వహించి అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఉండి మాజీ ఎమ్మెల్యే వేటుకూరి శివ రామరాజు స్వామిని దర్శించుకుని పూజలు చేయించుకున్నారు.

భక్తులకు తప్పని ఇబ్బందులు

పర్యవేక్షణ లోపంతో భక్తులకు ఇబ్బందులు తప్పలేదు. ఉదయం పదిగంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు భక్తుల తాకిడిపెరిగింది. అనంతరం భక్తుల రద్దీ తగ్గింది. పలుకుబడి ఉన్నవారికి మాత్రమే శివయ్య దర్శనం త్వరగా కలుగుతుందని భక్తులు బహిరంగంగా విమర్శించారు. వన్ టౌన్ సీఐ అడబాల శ్రీనివాస్ ప్రత్యేక పోలీస్ బందో బస్తు ఏర్పాటు చేశారు. ఆలయ ఈవో రామకృష్ణం రాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆచంటేశ్వరుని ఆలయంలో..

ఆచంట, మార్చి 8 : ఆచంటలోని ఆచంటేశ్వరుని ఆలయం మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం వేకువజాము నుంచి సాయంత్రం వరకు శివనామస్మరణతో హోరెత్తింది. ఉదయాన్నే భక్తులు కోడేరు గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి అనంతరం ఆచంటేశ్వరుని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిం చారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఆచంటేశ్వరుడిని ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు దంపతులు, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ, వైసీపీ నరసాపురం పార్లమెంట్ ఇన్‌చార్జి గూడూరి ఉమాబాల దర్శించుకున్నారు. భక్తులక కావాల్సిన ఏర్పాట్లను ఆలయ ఛైర్మన్ విద్యాసాగర్, ఈవో రాము పర్యవేక్షిం చారు. ఎస్ఐ ఎం.రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కన్నులపండువగా రథోత్సవం

ఆచంటేశ్వరుని రథోత్సవం కన్నులపండువగా సాగింది. రథాన్ని పలు రకాల పూలతో అలంకరించి సన్నాయిమేళాలు బాణసంచా కాల్పులు మధ్య గ్రామ పుర వీధులలలో రథోత్సవం నిర్వహించారు.

వీరంపాలెం శివాలయంలో..

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 8: వీరంపాలెం శివాలయంలో శివనామస్మరణ మార్మోగింది. రాత్రి 2 గంటల నుంచి స్ఫటికలింగేశ్వరస్వామికి మానస సరోవర జలంతోపాటు, దేశంలోని 12 నదీ జలాలతో అభిషేకాలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి సర్వజనులకు స్ఫటికలింగ దర్శన అవకాశం కల్పించారు. ఆలయ ప్రాంగణంలోని మహాదేవునికి విశేష ద్రవ్యాలు, అన్న కుంభాభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్ఫటికలింగేశ్వరుడిని, మహాదేవుడిని దర్శించుకున్నారు. తాడేపల్లిగూడెం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బొలిశెట్టి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే ఈలి నాని, వైసీపీ నేత కొట్టు విశాల్ తదితర ప్రముఖులు స్వామిని దర్శించుకున్నారు. రాత్రికి లక్ష దీపార్చన చేశారు. భక్తులకు మంచినీరు. మజ్జిగ ప్యాకెట్‌లతోపాటు, ఆహార ప్యాకెట్‌లు అందించారు. పూజా కార్యక్రమాలను ఆలయ వ్యవస్థాపకుడు గరిమెళ్ల వెంకటరమణ సిద్దాంతి పర్యవేక్షించారు.



బలివేలో భక్తజన సందోహం, (ఇన్‌సెట్‌లో) పిండప్రదానంలో చింతమనేని

బలివే రామస్వామి సన్నిధిలో..

పెదవేగి, మార్చి 8 : బలివే రామస్వామ సన్నిధిలో భక్తులు పోటెత్తారు. వేలసంఖ్యలో భక్తులు తమ్మిలేరులో పుణ్యస్నానాలు చేసి రామస్వామిని దర్శించుకున్నారు. పెదవేగి, దెందులూరు, పెదపాడు, ఏలూరు మండలాల తోపాటు సుదూర ప్రాంతాలనుంచి భక్తులు తరలివచ్చి తమ్మిలేరులో పుణ్యస్నానాలు చేపి, పితృతర్పణాలు వదిలారు. దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ శుక్రవారం తెల్లవారుజామునే బలివే చేరుకుని, తల్లిదండ్రులకు పిండప్రదానం చేశారు. పెదవేగి సీఐ కొండవీటి శ్రీనివాసకుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్, పెదవేగి మండలం విజయరాయి, నడిపల్లి గ్రామాల వరకు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి, పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. పెదవేగి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య కేంద్రానిన ఏర్పాటు చేసి భక్తులకు అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ద్రావణాన్ని సరఫరా చేశారు.

నేత్రపర్వం.. శివకల్యాణం



శివయ్యకు పంచ హారతులిస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల, మార్చి8: క్షేత్రపాలకునిగా విరాజిల్లుతున్న శివదేవుని ఆలయం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. స్వామివారి కల్యాణం శుక్రవారం రాత్రి వైభవంగా జరిగింది. ఆలయ గర్భాలయంలో వున్న శివయ్యకు అర్చకులు, పండితులు విశేషఅభిషేకాలు చేశారు. అలంకరణలు చేసి పంచహారతులిచ్చారు. రాత్రి లింగోద్భవ సమయంలో గంగా పార్వతీ సమేత శివదేవుని కల్యాణం భక్తుల శివనామస్మరణల నడుమ వైభవంగా సాగింది.



పార్థివలింగపూజలో భక్తురాలు

ఆకట్టుకున్న పార్థివలింగ పూజ

ద్వారకాతిరుమల మండలం తిమ్మాపురంలో ఓ భక్తుడు నిర్వహించిన పార్థివ లింగపూజ చూపరులను ఆకట్టుకుంది. పుట్టమన్నుతో శివలింగాన్ని తయారుచేశారు. అనంతరం ఆ శివలింగానికి తెల్లవార్లూ పూజలు, అభిషేకాలు జరిపారు. గ్రామానికి చెందిన బావి శెట్టి మధుసూదనరావు గత 30 ఏళ్లుగా ఈపార్థివ లింగ పూజ నిర్వహిస్తున్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శివాలయాల వద్ద పటిష్ట బందోబస్తు



పట్టిసీమలో పరిశీలించిన ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు క్రైం, మార్చి 8 : మహాశివరాత్రిని పురస్కరించుకుని జిల్లాలో వున్న శివాలయాల వద్ద పోలీసు యంత్రాంగం పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఐజీ జీవీ అశోక్‌కుమార్ ఆదేశాలతో ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి జిల్లాలోని భక్తుల రద్దీ ఎక్కువగా వున్న శివాలయాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా పట్టిసీమ, బలివే ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ మేరీ ప్రశాంతి పట్టిసీమకు స్వయంగా వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. భక్తులకు ఎటువంటి అవాంతరాలు లేకుండా ఉండేలా చర్యలపై సిబ్బందితో సమీక్షించారు. భక్తులకు నిర్దేశించిన క్యూలైన్లను పాటిస్తూ భగవంతుని దర్శించుకోవాలని సూచించారు. ఎస్పీ మేరీప్రశాంతి పోలీసు సిబ్బందితో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు.

పట్టిసీమ వీరేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

పోలవరం, మార్చి 8:పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో హర హర మహాదేవ శంభో శంకర అంటూ శివ నినాదంతో మార్మోగింది. శివక్షేత్రానికి శివరాత్రి సందర్భంగా రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు రెండున్నర లక్షల మంది భక్తులు దర్శించి పూజలు నిర్వహిం చారు. భక్తులు గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించి పితృదేవతలకు పిండప్రదానాలు నిర్వహించారు. లింగోద్భవ కాలంలో ఆలయ ట్రస్టీ కొచ్చర్ల కోట జగన్నాధం కుటుంబసభ్యులు, ఈవో ఎస్.సంగమేశ్వర శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత, ఐజీ అశోక్ కుమార్, ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి, జిల్లా పంచాయతీ అధికారి తూతిక విశ్వనాథ్ స్వామి వారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కాలి నడక భక్తులకు తప్పని ఇబ్బందులు

ఈ ఏడాది ఉత్సవాలకు వచ్చిన భక్తులకు కాలి నడక మరింత దూరమై ఇబ్బందులకు గురయ్యారు. ఎండలో ఫెర్రీ పాయింట్ నుంచి ఇసుక తిన్నెల్లో చలువ పందిళ్ల వరకు ఎండలో నడవడానికి ఇబ్బందులకు గురయ్యారు. పోలీసులు సైతం ఎండను తాళలేక ఫ్లెక్సీల నీడన తలదాచుకున్నారు. దారి పొడవునా మంచినీటి ప్యాకెట్ల పంపిణీ, చిన్నారులకు పాలు పంపిణీ భక్తులకు కొంత ఉపశమనం కలుగజేసింది.

ఏర్పాట్ల నిర్వహణ సంతృప్తికరం : డీఎస్పీ

పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్లు నిర్వహణ సంతృప్తికరంగా ఉన్నాయని డీఎస్పీ సురేష్‌కుమార్ రెడ్డి అన్నారు. ఉత్సవ ఏర్పాట్లలో 500 మంది పోలీస్ సిబ్బందిని బందోబస్తుకి వినియోగించామన్నారు. విపత్తుల శాఖ నుంచి 40 మంది, మత్స్యశాఖ-4 షిఫ్టులుగా 90 మంది సిబ్బంది, 130 మంది గజ ఈతగాళ్ళు, వైద్య ఆరోగ్యశాఖ 280 మంది సిబ్బంది మూడు షిఫ్టులు. రెవెన్యూ శాఖ నుంచి 186 మంది సిబ్బంది, అంగన్వాడీలు 70 మంది, గ్రామీణ నీటి సరఫరా శాఖ నుంచి ఏడు మండలాల ఏఈలు, 40 మంది సిబ్బంది ఒక ఎస్ఈ, డీఈ ఉత్సవాల్లో సేవలందించారన్నారు.



శివలింగాన్ని దర్శించుకున్న మంత్రి వనిత



పట్టిసీమ గోదావరి నది ఒడ్డున పిండ ప్రదానాలు



తపన చౌదరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చిన్నారుల కోలాటం

సుందరగిరిపై మహాసుదర్శన నృశింహయజ్ఞం




నృశింహయజ్ఞం నిర్వహిస్తున్న నరసింహ గురూజీ, ఆలయ ఆవరణలో సూర్యనమస్కారాలు చేస్తున్న రుత్వికుడు

ద్వారకాతిరుమల, మార్చి8: సుందరగిరిపై వున్న లక్ష్మీనరసింహుని ఆలయంలో శుక్రవారం సాయంత్రం ప్రారంభమైన శ్రీమహాసుదర్శన నృశింహయజ్ఞం భక్తుల కు కన్నులపండువైంది. ప్రతి ఏటావలే మహాశివరాత్రి రోజు సాయంత్రం మొదలుగా తెల్లవార్లూ ఈ యజ్ఞాన్ని ఎంతో భక్తిప్రపత్తులతో సంప్రదాయంగా నిర్వహించారు. స్వయంభూవైన నరసింహస్వామికి ఈ యజ్ఞం జరపడం వల్ల లోకశాంతి చేకూరుతుందని నమ్మకం, ఈ సందర్భంగా ఆలయపరిసరాలను సుందరీకరించారు. హైదరాబాదుకు చెందిన కొచ్చర్లకోట నరసింహం ఆధ్వర్యంలో సీహెచ్ కుటుంబరావు యజ్ఞ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉదయం విశేషకార్యక్రమాలు జరిగాయి. యజ్ఞక్రతువులో భాగంగా అభిషేకం నిమిత్తం ఏర్పాటుచేసిన 1,331 కలశాలను వినియోగించారు. పలు వనమూలికలు, భక్ష్యాలు, పలు రకాల ద్రవ్యాలు, తొమ్మిది రకాల సమిదులు, ఖరీదైన ద్రవ్యాలను యజ్ఞక్రతువుకు ఉపయోగించారు. తెల్లవార్లూ జరిగిన ఈ యజ్ఞక్రతువు భక్తులను అలరించింది.

నేడు వైద్య ఉద్యోగులకు క్రమబద్ధీకరణ ఉత్తర్వుల జారీ

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 8:ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న పలు కేడర్ల ఉద్యోగుల్లో అర్హులైనవారికి సర్వీసుల క్రమబద్ధీకరణ ఉత్తర్వులను శనివారం జారీ చేయను న్నారు. ఈ మేరకు జీవోలు 30,31 ప్రకారం తొలివిడతగా ప్రభుత్వం పంపిన జాబితాలో వున్న ఉద్యోగులకు శనివారం ఉదయం పది గంటలకు ఏలూరు డీఎంహెచ్‌వో కార్యాలయంలో రెగ్యులరైజేషన్ ఆర్డర్లను ఇవ్వనున్నారు. ఉమ్మడి జిల్లాలో తొలివిడతగా ఎంపీహెచ్ఏ(మేల్) ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌కు 161 మందితో కూడిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపగా 114 మందికి, ల్యాబ్ టెక్నీషియన్లు 14మందికి గాను ఒకరికి, ఫార్మాసిస్టులు 14మందికిగాను 9మందికి, ఎంపీహెచ్ఏ(ఫిమేల్)/ఏఎన్ఎంలు 78మందికి గాను 61మందికి శనివారం క్రమబ ద్ధీకరణ ఉత్తర్వులు ఇస్తారు. వీరితోపాటు ఇద్దరు ఆప్తాల్మిక్ అసిస్టెంట్లకు సంబం ధించిన ప్రతిపాదనలను కూడా పంపినప్పటికీ తొలివిడత జాబితాలో క్లియరెన్స్ రాలేదు. ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనల్లో దాదాపు 70శాతం మంది ఉద్యోగు లకు క్రమబద్ధీకరణ ప్రయోజనం లభించినట్టయిందని డీఎంహెచ్‌వో కార్యాలయ వర్గాలు తెలిపాయి. సంబంధిత ఉద్యోగులు ప్రస్తుతం పనిచేస్తున్న శాంక్షన్/క్లియర్ వెకెన్సీ స్థానాల్లోనే రెగ్యులర్ ఉద్యోగులుగా ఇకమీదట కొనసా గుతారు. ప్రతిపాదిత జాబితాల్లోని మిగతా ఉద్యోగులకు కూడా ఎన్నికల కోడ్ అమల్లోకి రాకముందే అంటే సోమ లేదా మంగళవారాల్లో రెండు, మూడోవిడత క్రమబద్ధీకరణ జీవోలు జారీఅయ్యే అవకాశం ఉందని వివరించాయి.

కాపు సంక్షేమ సేన కమిటీలు రద్దు : జోగయ్య

పాలకొల్లు, మార్చి 8: రాష్ట్రంలో కాపు సంక్షేమ సేన కమిటీలన్నీ తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్టు కాపు సంక్షేమ సేన అధ్యక్షుడు చేగొండి హరిరామ జోగయ్య శుక్రవారం పాలకొల్లులో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యవస్థాపక అధ్యక్షుడైన జోగయ్య పలు హోదాల్లో పనిచేస్తున్న అందరి పదవులు, అన్ని కమిటీలను రద్దు పరుస్తూ తీర్మానం చేసినట్టు పేర్కొన్నారు. ముద్రగడ పద్మనాభం కాపు సంక్షేమ పోరాటం నుంచి తప్పుకున్న నాటి నుంచి తాను కాపు సంక్షేమ సేనను ప్రారంభించానని తెలిపారు. అప్పటినుంచి కాపులకు విద్య, ఉద్యోగాలలో ఐదు శాతం రిజర్వేషన్ కోసం అనేక పోరాటాలు చేసి నిరాహార దీక్ష చేపట్టాన న్నారు. కానీ నా కుమారుడి రాజకీయ భవిష్యత్తు కోసం తాను ఎప్పుడూ నా వ్యక్తిత్వాన్ని తాకట్టు పెట్టలేదన్నారు. పవన్ కల్యాణ్‌ను ముఖ్యమంత్రిని చేయాలనే నా పోరాటాన్ని కొందరు ఎందుకు తప్పుగా భావిస్తున్నారో అర్థం కావడం లేద న్నారు. ఇక నుంచి కేవలం రాజకీయ విశ్లేషకుడిగా మాత్రమే కొనసాగుతానన్నారు.

కాపు సంక్షేమ సేన రాష్ట్ర ఉపాధ్యక్ష పదవికి రాజీనామా : మల్లినీడి

కాపు సంక్షేమ సేన రాష్ట్ర ఉపాధ్యక్ష పదవీ బాధ్యతలకు రాజీనామా చేస్తున్నా నని మల్లినీడి తిరుమలరావు (బాబి) గురువారం సాయంత్రం తెలిపారు. రాష్ట్రంలో ఏర్పడిన తాజా రాజకీ య పరిణామాల వల్ల కాపు సంక్షేమ సేనపై ఉన్న విశ్వసనీయత సన్నగిల్లిందనే విషయాన్ని సేన వ్యవస్థాపక అధ్యక్షుడు చేగొండి హరిరామజోగయ్యకు తెలుపుతూ రాజీనామా చేస్తున్నానన్నారు.

స్వచ్ఛందంగా తూడు తొలగించిన రైతులు



కె.పెంటపాడు చిలకం తూములో తూడు తొలగిస్తున్న సర్పంచ్ సత్యనారాయణ, రైతులు

పెంటపాడు, మార్చి 8: వంతుల వారీ విధానంలో తమ పొలాలకు సాగునీరు అందించే పంటబోదెలో తూడు విపరీతంగా పెరిగిపోవ డంతో కె.పెంటపాడు రైతులు స్వ చ్ఛందంగా తూడు తొలగించుకు న్నారు. సుమారు 500 ఎకరాల ఆ యకట్టు కల్గిన ఊరు మొదల తూ ము నుంచి చిలకం తూము వరకు కాల్వలో ఉన్న తూడును శుక్రవారం తొలగించుకున్నారు. కార్యక్రమానికి నాయక త్వం వహించిన సర్పంచ్ పీతల సత్యనారాయణ మాట్లాడుతూ వంతుల వారీ విధానంలో సాగు నీరు సరిపోవడంలేదని అధికారులు సమస్య పరిష్కరించాలన్నారు.

క్రైం సమాచారం

రెండు బైక్‌లు ఢీ.. ముగ్గురి మృతి

మరో యువకుడికి తీవ్ర గాయాలు.. పాలకొల్లు ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స



ఆర్.అభిరామ్ సీహెచ్.ఆనంద్ ఎస్.దుర్గారావు(ఫైల్ ఫొటోలు)

ఆచంట, మార్చి 8 : ఆచంట-మార్టేరు ఆర్అండ్‌బీ రహదారిలో ఆచంట కొఠాలపర్రు వంతెన వద్ద ఎదురెదురుగా మోటారు సైకిళ్లు ఢీకొన్న ప్రమా దంలో ముగ్గురు మృతి చెందగా మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఆచంట ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాలివి.. ఆచంట పంచాయతీ పరిధి గొల్లపల్లివారిచెరువుకు చెందిన రొక్కాల అభిరామ్ (22) ఆచంట పెదపేటకు చెందిన చదలవాడ ఆనంద్(22) ఇరువురూ స్నేహితులు. వీరు తూర్పుపాలెం నుంచి మోటారుసైకిల్‌పై ఆచంట వస్తున్నారు. అదేవిధంగా పోడూరు మండలం పండితవిల్లూరు పంచాయతీ పరిధిలో లక్ష్మీచెరువు గట్టుకు చెందిన చుక్కా దుర్గారావు (29), పితాని సాయి ఇరువురు స్నేహితులు సరదాగా ఆచంటలో జరుగుతున్న రామేశ్వరస్వామి శివరాత్రి తిరునాళ్ళు వీక్షించి గురువారం అర్ధరాత్రి ఆచంట నుంచి మోటారు సైకిల్‌పై పండితవిల్లూరు వెళుతుండగా మార్టేరు-ఆచంట కొఠాలపర్రు వంతెన వద్ద ఈ రెండు బైక్‌లు ఢీ కొన్నాయి. అభిరామ్, ఆనంద్ ఘటన స్థలంలోనే మృతి చెందగా మిగిలిన ఇద్దరిని 108 వాహనంలో ఆసుపత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యలో దుర్గారావు మృతి చెందినట్టు తెలిపారు. తీవ్ర గాయాలైన పితాని సాయి పాలకొల్లు ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

ఆచంట మండలంలో విషాదఛాయలు..

ఈ ప్రమాదంలో మృతి చెందిన రొక్కాల అభిరామ్, చదలవాడ ఆనంద్ ఇద్దరు యువకులు పనులు చేసుకుంటున్నారు. అభిరామ్, ఆనంద్ తల్లులు ఉపాధి నిమిత్తం ఇటీవల గల్ఫ్ దేశానికి వెళ్లారు. మరొకరు చుక్కా దుర్గారావు కు నాలుగేళ్ల క్రితం వివాహం కాగా మూడేళ్ల కుమార్తె ఉంది. శివరాత్రి పండుగ రోజున ఆచంటలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృత దేహాలను పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎస్ఐ రాజ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పవిత్ర స్నానానికి వెళ్లి.. వృద్ధురాలి మృతి

భీమడోలు మార్చి 8 : భీమడోలు మండలం పూళ్ళ శివారు సదాశివపురం కాల్వ రేవులో శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని శుక్రవారం ఉదయం పవిత్ర స్నానం నిమిత్తం వెళ్లిన వడ్లపాటి స్వర్ణదుర్గ(63) ఏలూరు కాల్వలో గల్లతయింది. ఉదయం ఆరు గంటల సమయంలో కొందరు మహిళలు నీళ్ల తెచ్చేందుకు కాల్వకు వెళ్లగా రేవు గట్టు వద్ద సెల్ ఫోన్, దుస్తులు గమనించి స్వర్ణ దుర్గ బంధువులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలిసి భీమడోలు విపత్తుల శాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వగా ఆమె మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టంకు పంపారు.

గల్లంతైన మృతదేహం లభ్యం

పెదపాడు, మార్చి 8 : పెదపాడు మండలం వట్లూరు గ్రామానికి చెందిన వసంతవాడ ఏడుకొండలు గురువారం గేదెలు మేపడానికి వెళ్లి చెరువు ఊబిలో పడి గల్లంతయ్యాడు. గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఏడుకొండలు ఆచూకీ లభించలేదు. అతడి మృతదేహం శుక్రవారం లభించింది. పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని త్రీటౌన్ సీఐ వి.వెంకటేశ్వరరావు తెలిపారు.

చికిత్స పొందుతూ సచివాలయ ఉద్యోగి మృతి




శేషబాబు(ఫైల్)

ఉంగుటూరు, మార్చి 8 : జాతీయ రహదారిపై మోటారు సైకిల్ అదుపు తప్పి ఓ ఆటోను ఢీకొనగా తలకు తీవ్ర గాయమైన కైకరం సచివాలయ సీనియర్ అసిస్టెంట్ మద్ది శేషబాబు(61) రాజమహేంద్రవరం ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. చేబ్రోలు పోలీసుల తెలిపిన వివరాలివి.. కైకరం సచివాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మద్ది శేషబాబు ఈనెల 4వ తేదీన సాయంత్రం విధి నిర్వహణ ముగించుకుని తాడేపల్లిగూడెంలోని తన ఇంటికి వెళ్లే క్రమంలో కైకరం శివారు మోటారుసైకిల్ అదుపు తప్పి ఆటోను ఢీకొనగా తలకు తీవ్ర గాయమైంది. తొలుత చికిత్స నిమిత్తం తాడేపల్లిగూడెం అనంతరం రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందారు. ఆయనకు భార్య, ఇరువురు కుమారులు ఉన్నారు. ఆయన మృతి పట్ల గ్రామ సర్పం సలగాల గోపి, కార్యదర్శి నాగేంద్ర, సచివాలయ సిబ్బంది తదితరులు సంతాపం తెలిపారు.

చల్లచింతలపూడిలో తల్లిపై కత్తితో కొడుకు దాడి

దెందులూరు, మార్చి 8 : నవమాసాలు మోసి, పెంచిన కన్న తల్లిపై కొడుకు కత్తితో దాడి చేసిన ఘటన దెందులూరు మండలం చల్లచిం తలపూడిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలివి.. చల్లచింతలపూడి గ్రామానికి చెందిన నల్లిబోయిన వరలక్ష్మి పెదపాడు గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో ఇరవైఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. గత కొంతకాలంగా భర్తకు నల్లిబోయిన వరలక్ష్మి మధ్య మనస్పర్థల కారణంగా విడిపోయారు. భర్త పెదపాడులో 20 ఏళ్ల వయస్సు గల కొడుకుతో వేరుగా ఉంటుండగా వరలక్ష్మి కుమార్తెతో కలిసి చల్లచింతలపూడిలోని జగనన్న కాలనీలో ఉంటుంది. శుక్రవారం ఉదయం ఐదు గంటల సమయంలో ఇంటిలో నిద్రపోతున్న వరలక్ష్మి ఇంటికి వచ్చిన కుమారుడు తలుపు కొట్టడంతో ఆమె తలుపు తీసింది. అప్పటికే కత్తితో సిద్ధంగా వున్న కుమారుడు నల్లిబోయిన చక్రపాణి కత్తితో మెడపై దాడి చేశాడు. ఆమె చేతులు అడ్డు పెట్టడంతో చేతికి గాయం కాగా పెద్దగా కేకలు పెట్టడంతో కుమారుడు పారిపోయాడు. కొంతమంది గ్రామస్థులు ఆమె ఏలూరు ఆసుపత్రికి తరలిం చారు. ఆస్తి వివాదం కారణమని కొంతమంది స్థానికులు అనుమానిస్తున్నారు. మహిళా దినోత్సవం రోజు తల్లిపై కుమారుడు దాడి చేయడంతో ఈ విషయం గ్రామంలో చర్చనీయాంశమైంది.

కనీవినీ ఎరుగని రీతిలో బీసీ డిక్లరేషన్



టీడీపీ-జనసేన పది అంశాలతో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ కనీవినీ ఎరుగని రీతిలో ఉంది. ఇటువంటి డిక్లరేషన్ నభూతో నభవిష్యత్ అని చెప్పొచ్చు. టీడీపీ వచ్చిన తర్వాతే బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్‌లు కలిగాయి. 50 ఏళ్లకే పెన్షన్, ప్రత్యేక రక్షణ చట్టం, ఆర్థికాభివృద్ధి, ఉపాధికి ప్రోత్సాహకాలు ఇవ్వడం వంటివి అమలు చేస్తామనడం బీసీలకు ఇచ్చే ప్రాధాన్యత స్పష్టమవుతోంది. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా బీసీలు నిలదొక్కుకునేందుకు టీడీపీ-జనసేన ప్రకటించిన డిక్లరేషన్ ఊతమిస్తోంది. బీసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే ఈ పొత్తు అధికారంలోకి రావాల్సిందే.

- కూరాకుల బుజ్జి యాదవ్
బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి, ద్వారకాతిరుమల

ఉద్యాన వర్సిటీలో మహిళా దినోత్సవం



ఆటల పోటీల్లో మహిళా ఉద్యోగులు

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 8 :వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఆవరణలో జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యాన విశ్వవిద్యాలయ బోధనా, బోధనేతర సిబ్బందికి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. డీన్ ఆఫ్ స్టూడెంట్ ఎఫైర్స్ డాక్టర్ ఏఎస్ పద్మావతమ్మ, డాక్టర్ సలోమిసునీత, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ మాధవి మాట్లాడారు.

గోదావరి ఇసుక రీచ్‌కి అడ్డంగా కందకం

- ఇసుక అక్రమ తవ్వకాలకు రెవెన్యూ అధికారుల చెక్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఇబ్రహీంపేట ఇసుక రీచ్‌కి కందకం తవ్విస్తున్న తహసీల్దార్ అచ్యుత కుమారి

కుక్కునూరు,మార్చి 8 : కుక్కునూరు మండలంలో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలపై శుక్రవారం ఆంధ్రజ్యోతిలో 'ఇసుక దోచేస్తున్నారు' అనే శీర్షికన కథనానికి రెవెన్యూశాఖ అధికారు లు స్పందిం చారు. కుక్కునూరు తహసీ ల్దార్ అచ్యుత కుమారి ఇసుక అక్రమ రవాణాకు చెక్ చెప్పాలని నిర్ణయించారు. ఈ క్రమంలో ఇబ్రహీంపేట గోదావరి ఇసుక రీచ్‌కి వెళ్లే రహదారికి అడ్డంగా ఎక్స్‌కవేటర్ ఉపయోగించి కందకం తవ్వించారు. దీంతో ఇసుక తరలించడానికి వేరే మార్గం లేకుండా పోతుందని, అక్రమ రవాణాకు చెక్ పడుతుందని తహసీ ల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ వెంకట్, వీఆర్వో ఇబ్రహీం పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా కోసం రిలే దీక్ష



రిలే దీక్ష చేస్తున్న విజయకుమార్

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 8: రానున్న ఎన్నికల్లో రాజకీయ పార్టీలు రాష్ట్రానికి ప్రత్యేక హోదా అంశాన్ని మేనిఫె స్టోలో ప్రకటించాలని కోరుతూ తాడేప ల్లిగూడెం పట్టణానికి చెందిన కూనంపూడి విజయకుమార్ శుక్రవారం రిలే దీక్ష చేపటా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక హోదాతో రాష్ట్రానికి పరిశ్రమలతో పాటు రైల్వేజోన్ రావడంతో పాటు విశాఖ ఉక్కు ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు.

కోరుకొల్లులో ఓటర్ల పరిశీలన

పాలకోడేరు, మార్చి 8 : కోరుకొల్లు గ్రామంలో 100 ఓట్లు బయటి వారివి చేర్పించారంటూ గ్రామానికి చెందిన రామాంజనేయరాజు ఎలక్షన్ కమిషన్‌కి ఫిర్యాదు చేయడంతో ఎలక్షన్ కమిషన్ ఆదేశాలతో శుక్రవారం ఇంటింటికి వెళ్ళి విచారణ చేపట్టడం జరిగిందని జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో), ఉండి నియోజకవర్గ ఎన్నికల అధికారి ఆర్.విక్టర్ తెలిపారు. పాలకోడేరు తహసీల్దార్ నాగార్జున, వారి సిబ్బందితో, పంచాయతీ కార్యదర్శులు, ఉండి తహసీల్దార్ శ్రీనివాస్ తదితర అధికారులు గ్రామంలో ఇంటింటికి వెళ్ళి విచారణ చేపట్టారు. ఈ నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని ఉండి ఎన్నికల అధికారి ఆర్.విక్టర్ తెలిపారు.

పోలీసు కవాతు


నరసాపురంలో పోలీసు కవాతు

నరసాపురం, మార్చి 8: పట్టణంలో సీఆర్‌పీఎఫ్‌తో కలిసి జిల్లా పోలీసులు కవాతు నిర్వహించారు. శుక్రవారం జగన్నాథస్వామి ఆలయం నుంచి పుర వీధుల గుండా అంబేడ్కర్ సెంటర్ వరకు ఈ కవాతు సాగింది. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని విన్నవిస్తూ కవాతు సాగింది.

తణుకు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకునేలా, వారిలో ధైర్యం, భద్రతా భావం కలిగించేలా సాయుధ బలగాలు శుక్రవారం పట్టణంలో కవాతు నిర్వహించాయి. మున్సిపల్ కమిషనర్ టీవీ రమణ, సీఐ నాగరాజు, ట్రాఫిక్ ఎస్‌ఐ జానా సతీష్, పట్టణ ఎస్‌ఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకివీడు: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ స ంఘటనలకు తావులేకుండా ప్రజలు ధైర్యంగా ఓటును సద్వినియోగం చేసుకోవాల ంటూ ఎస్‌ఐ బత్తిన నాగబాబు నేతృత్వంలో పోలీసులు, కేంద్ర బలగాలు శుక్రవారం కవాతు నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి గుమ్ములూరు సెంటర్, మాదివాడ మీదుగా మెయిన్ సెంటర్ వరకూ కవాతు నిర్వహించి ప్రజలు, ఆటో డ్రైవర్ల కు అవగాహన కల్పించారు.

మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ


కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శివ

పాలకోడేరు, మార్చి 8 : మహిళలకు ఉపాధి కల్పించి వారి జీవితాల్లో వెలుగు నింప టమే శివ స్వచ్ఛంద సేవా సంస్థ ధ్యేయమని మాజీ ఎమ్మెల్యే, సంస్థ అధినేత వేటుకూరి వెంకట శివరామరాజు అన్నారు. భీమవరంలోని ఆయన కార్యాలయం వద్ద అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం పేద మహిళలకు కుట్టు మిషన్లు అందించారు. కలవపూడి సర్పంచ్ గేదల జాన్, ఉండి ఏఎంసీ మాజీ చైర్మన్ సాగిరాజు సాంబశివరాజు, మంతెన రవిరాజు, ఆనందపురం మాజీ సర్పంచ్ బర్రె సీతారామ్మాస్వామి, ఇందుకూరి అప్పలరాజు, చెరుకువాడ ఉపసర్పంచ్ నడింపల్లి వెంకటరాజు, వేగేశ్న మహేష్‌రాజు పాల్గొన్నారు.

ద్రాక్ష పండ్లతో అమ్మవారికి అలంకరణ

భీమవరం టౌన్, మార్చి 8: మెంటేవారి తోటలోని శ్రీబాలత్రిపుర సుందరిదేవి అమ్మవారికి 100 కేజీల ద్రాక్ష పండ్లతో ప్రత్యేక అలంకరణ చేశారు. పట్టణానికి చెందిన ఎంవి రమణ మూర్తి, నంద్యాల రవివర్మ దంపతులచే ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్ అమ్మవారికి కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

పౌష్టికాహారం పంపిణీ

భీమవరం అర్బన్, మార్చి 8: స్వేచ్ఛ మహిళా సంఘం ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ బాధిత కుటుంబాల వారికి పౌష్టికాహారం అందించారు. 20 మంది బాధిత కుటుంబాలకు బియ్యం, పప్పు దినుసులు, బెల్లం, పండ్లు అందించారు. కార్యక్రమంలో అరసవల్లి చారిటీస్ అధ్యక్షులు అరసవల్లి సుబ్రహ్మణ్యం, స్వేచ్ఛ మహిళా సంఘం సభ్యులు దర్మావతి, గౌరి, పద్మ, లక్ష్మి, రమణమ్మ, స్వాతి పాల్గొన్నారు.

పరకాల ట్రస్ట్ మహిళా సేవలు

పోడూరు, మార్చి 8: కవిటం పరకాల ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నెట్ క్రేకర్ ఇండియా సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన గోదావరి చిల్డ్రన్ పార్కును సర్పంచ్ చుట్టిగుళ్ల పూర్ణిమ ప్రారంభించారు. మహిళా భవనంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి గర్భిణులకు వైద్యసేవలందించి పౌష్టికాహార కిట్లును పంపిణీ చేశారు. 200మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పరకాల ట్రస్ట్ చైర్మన్ పరకాల సూర్యమోహన్, కార్యదర్శి పరకాల రమేష్‌బాబు, డాక్టర్ వై.నామగిరి, డాక్టర్ జనార్దన్, ఎస్‌బీఐ మేనేజర్ ఎస్.సతీష్ పాల్గొన్నారు.

నరసాపురం రేస్‌లో ఉన్నా.. భగవాన్‌రాజు



భీమవరం రూరల్, మార్చి 8 : నర్సాపురం లోక్‌సభ భారతీయ జనతా పార్టీ అభ్యర్థి రేసులో తాను ఉన్నట్లు ఈపార్టీకి చెందిన సీనియర్ నాయకులు కలిదిండి భగవాన్‌రాజు తెలిపారు. దిరుసుమర్రు గ్రామంలో ఆయన స్వగృహంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తనను నర్సాపురం ఎంపీ అభ్యర్థిగా గెలిపిస్తే కేంద్ర మంత్రి పదవి తెచ్చుకుని ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ప్రకటించారు. 1976 నుంచి ఆర్‌ఎస్‌ఎస్‌లో పనిచేస్తున్నట్లు వివరించారు.

ఇళ్ళ మధ్యలో కూలిన మామిడి చెట్టు



ఆకివీడు, మార్చి 8: భారీ మామిడి చెట్టు మొదలు పుచ్చిపోయి గురువారం రాత్రి నేలకొరిగింది. మాదివాడ దేవాలయం పక్క సందులో ఖాళీ స్థలంలో ఉన్న భారీ మామిడి వృక్షం సీసీ రోడ్డుపై పడడం వలన ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదు. అయితే కరెంటు స్తంభం కూడా తుప్పు పట్టడంతో ఒరిగింది. విద్యుత్ సరఫరా నిలుపుదల చేసి శుక్రవారం విద్యుత్‌శాఖ సిబ్బంది తొలగించి కొత్త స్తంభం ఏర్పాటు చేశారు.

షార్ట్ సర్క్యూట్

ఆకివీడు, మార్చి 8: గుమ్ములూరు సెంటర్‌లో డి.సూరయ్య నివాసంలో విద్యుత్ బోర్డులో షార్ట్ సర్క్యూట్‌తో మీటరు దగ్ధమైంది. అగ్నిమాపకశాఖ సిబ్బంది సకాలంలో వచ్చి మంటలు అదుపు చేయడంతో ప్రమాదం తప్పింది.

సమాచారం ఇవ్వరా..



ఉండి, మార్చి 8: తన వార్డులో తనకు సమాచారం ఇవ్వకుండా శంకు స్థాపనలు చేయడం న్యాయమేనా అంటూ ఉండి పంచాయతీ వార్డు నాలుగవ వార్డు సభ్యుడు, నియెజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు చెన్నంశెట్టి హరి నాయుడు మండిపడ్డారు. శుక్రవారం ఉండి జంగాలకాలనీలో సీసీ రహ దారులకు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ భూమిపూజ చేయడాన్ని అయన ఆక్షే పించారు. తన వార్డులో తనకు చెప్పకుండా సర్పంచ్, ఎంపీపీలు భూమి పూజలు నిర్వహించడం ఎంతవరకు సబబు అంటూ ఆయన ప్రశ్నించారు. స్పందనలో ఫిర్యాదు చేస్తానంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

స్త్రీ శక్తి స్వరూపిణి



పెనుగొండ, మార్చి8: స్త్రీని శక్తి స్వరూపంగా పూజించబడుతున్నది భారతీయ సనాతన హైందవ ధర్మం అని ప్రముఖ వాస్తు జ్యోతిష్య శాస్త్ర నిపుణులు, ఆధ్యాత్మికవేత్త, రేలంగి కుమార్ శంకర్ గౌడ్ అన్నారు. శుక్రవారం సిద్ధాంతం గ్రామంలో హిందూ ధర్మ పరిక్షణ సమితి ఆధ్వర్యంలో శివరాత్రి, మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అయన ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. స్త్రీ శక్తి స్వరూపిణి అని, అందరూ స్త్రీ జాతిని గౌరవించాలన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



తాడేపల్లిగూడెం అర్బన్, మార్చి 8: ఆపదలో ఉన్నవారికి జనసేన అండగా ఉంటుందని జనసేన నియోజక వర్గ ఇన్‌చార్జి బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన సాయిప్రకాష్ అనే యువకుడు ఆర్థిక సమస్యలతో పురుగుల మందు తాగి ఆసుపత్రిలో చేరగా అతని కుటుంబీకులు బొలిశెట్టిని కలసి విషయం తెలిపారు. దీంతో స్పందించిన శ్రీనివాస్ రూ.15 వేలు అందజేశారు. కార్యక్రమంలో మండల జనసేన అధ్యక్షుడు పుల్లా బాబి తదితరులు పాల్గొన్నారు.





ఆకివీడులో స్వామికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న మాజీ ఎమ్మెల్యే శివ.. దిరుసుమర్రు శివాలయంలో పూజలు... వీరవాసరంలో పూజలో పాల్గొన్న భక్తులు.. తాడేపల్లిగూడెం మండలంలో ఆలయం వద్ద భక్తుల రద్దీ

హరహర మహాదేవ

శివాలయాలకు క్యూకట్టిన భక్తులు... మహాశివరాత్రి ప్రత్యేక పూజలు

నరసాపురం టౌన్, మార్చి 8: పట్టణ, మండలంలో శుక్రవారం శివనామస్మరణతో మారుమ్రోగింది. శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. మహాశివరాత్రిని పురస్కరించుకుని అర్ధరాత్రి నుంచి భక్తులు శివాలయాలకు క్యూ కట్టారు. లక్ష్మణేశ్వరం గ్రామంలో లక్ష్మణేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. ఉభయగోదావరి జిల్లాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సుమారు 30వేల మంది భక్తులు స్వామివార్ని దర్శించుకున్నారు. రథం ఊరేగింపులో ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి, మాజీ మంత్రి కొత్తపల్లి, మాజీ ఎమ్మెల్యే బండారు, ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, కొవ్వలి నాయుడు, జనసేన నాయకులు బొమ్మిడి నాయకర్, చాగంటి చిన్న పాల్గొన్నారు.

ఆకివీడు: ఆకివీడులో శివాలయాల వద్ద భక్తులు బారులు తీరారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఎమ్మెల్యే మంతెన రామరాజు, మాజీ ఎమ్మెల్యే శివ, నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి జుత్తిగ నాగరాజు, వైసీపీ ఇన్‌చార్జి పీవీఎల్ నర్సింహరాజు శుక్రవారం శివ దర్శనం చేసుకున్నారు. జవహరపేటలోని రాజరాజేశ్వరీ సహిత మార్కండేయేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ గొంట్లా గణపతి పూర్ణకుంభంతో ఎమ్మెల్యే రామరాజు, జనసేన నాగరాజుకు స్వాగతం పలికారు. మాదివాడ మల్లేశ్వరస్వామిని మాజీ ఎమ్మెల్యే శివ దర్శించుకున్నారు.సాలిపేట వీరభద్రుడికి శివ పట్టువస్త్రాలు తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు వీరభద్రుడు సంబరం తిలకించారు. రాత్రి భక్తులు నిప్పుల గుండం తొక్కారు.

కాళ్ళ: పెదఅమిరం, సీసలి, కలవపూడి, కాళ్ళ, కాళ్ళకూరు, కోపల్లె, వేంపాడు, ఏలూరుపాడు, బొండాడ గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. జువ్వలపాలెం, కలవపూడి గ్రామాల్లో ఎమ్మెల్యే మంతెన రామరాజు, మాజీ ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజు, జనసేన ఉండి ఇన్‌చార్జీ జుత్తిగ నాగరాజు, టీడీపీ బోర్డు మాజీ సభ్యుడు గోకరాజు రామరాజులు సహకారంతో అన్నసమారాధనలు నిర్వహించారు.

పాలకోడేరు: పాలకోడేరు మండలంలోని అన్ని గ్రామాల్లో మహాశివరాత్రి పండుగను భక్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకున్నారు. వేకువజామునే శివుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని మోగల్లు, గరగపర్రు, గొల్లలకోడేరు, పాలకోడేరు, శృంగవృక్షం, పెన్నాడ, తదితర గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

పోడూరు: జిన్నూరు శ్రీఅన్నపూర్ణేశ్వరి అమ్మవారి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలకు పెట్టింది పేరు. ఏటా మూడు రోజులు పాటు అమ్మవారి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు అత్యంత ఘనంగా జరుగుతాయి. దీనిలో భాగంగా శుక్రవారం శ్రీఅన్నపూర్ణేశ్వరి అమ్మవారికి శివరాత్రి సందర్భంగా ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు నిర్వహించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు విచ్చేసి శ్రీఅన్నపూర్ణేశ్వరి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలో అఖండ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మెన్ జమ్ము మృత్యంజయరావు, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

● పెనుమదం శ్రీఉమాఅగస్తేశ్వరస్వామి అభిషేకాలు నిర్వహించారు. ఉమాబాలాత్రిపుర సుందరీదేవి అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. విశేషాలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు.

తణుకు: మహాశివరాత్రి సందర్భంగా తణుకు పట్టణంలో సిద్ధేశ్వర స్వామిని మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, కృష్ణ తులసి దంపతులు దర్శించుకుని పూజలు చేశారు. ప్రజలకు పరమశివుని ఆశీస్సులతో మేలు జరగాలని కోరారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. తేతలి రాజరాజేశ్వరి ఆలయం, తణుకులోని సిద్ధేశ్వర, కపర్దీశ్వర. సజ్జాపురం శివాలయంలో భక్తులు వేకువ జాము నుంచే బారులు తీరారు. అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మొగల్తూరు: తీర ప్రాంత శ్రీశైలంగా పేరుగాంచిన వడయార్‌పేట భూలింగేశ్వర వనమల్లిఖార్జున ఆలయంలో భక్తులు నేరుగా స్వామివారిని తాకి అభిషేకం చేసుకునే అవకాశం ఉండటంతో ఈ ఆలయానికి సుదూర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అభిషేకాలు నిర్వహించారు. మొగల్తూరులోని పార్వతీ విశ్వేశ్వరస్వామి ఆలయం, కాళీపట్నం కాళికేశ్వరస్వామి ఆలయం, ముత్యాపల్లి భువనేశ్వరీ సమేత ముక్తేశ్వరస్వామి ఆలయం, పేరుపాలెం, కొత్తపాలెం గ్రామాల్లోని చంద్రమౌళేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

పెనుగొండ: మండలంలోని సిద్ధాంతం వశిష్ఠ గోదావరి నదిలో తెల్లవారుజామున మూడు గంటల నుంచి వేలాది మంది భక్తులు పుణ్య స్నానాలు చేసి భారీ క్యూలైన్‌లో నిలబడి కేదారేశ్వర స్వామిని దర్శించుకున్నారు. సిద్ధాంతం రావి చెట్టు సెంటర్‌లో శ్రీ పార్వతి సమేత నందీశ్వర స్వామి ఆలయం వద్ద భక్తుల సహకారంతో భక్తులకు భారీ అన్న సమారాధన నిర్వహించారు. పెనుగొండ శ్రీ మహిషాసుర మర్దని సమేత నగరేశ్వర స్వామి, వాసవి అమ్మవారి ఆలయానికి, చెరుకువాడలో ఉమా విశ్వేశ్వర స్వామి, వడలిలో అగస్త్యేశ్వర స్వామి, ఇలపర్రులో నీలకంఠేశ్వర స్వామి ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భీమవరం రూరల్: యనమదుర్రు శక్తీశ్వరస్వామి ఆలయంలోను దిరుసుమర్రు గంగా భ్రమరాంబిక రామలింగేశ్వరస్వామి ఆలయాలలో స్వామివారికి అభిషేకాలు, దీపారాధనలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వీరవాసరం: వీరవాసరంలోని వీరేశ్వర విశ్వేశ్వర దేవస్థానం, రాయకుదురు లోని ఉమామూలేశ్వర సుందరేశ్వరస్వామి ఆలయాలు, కొణితివాడ ఉమారామలింగేశ్వర స్వామి తదితర ఆలయాల్లో రుద్రాభిషేకాలు నిర్వహించారు. చింతలకోటిగరువు, కొణితివాడలో అన్న సమారాధన జరిపారు. వీరవాసరం, రాయకుదురు దేవస్థానాలలో పులిహోర ప్రసాద వితరణతో పాటు బాదంపాలను భక్తులకు పంపిణీ చేశారు.

యలమంచిలి: యలమంచిలి, లక్ష్మీపాలెం, మేడపాడు, ఇంచినాడ, గుంపర్రు గ్రామాల్లోని శివాలయాల్లో మహాశివరాత్రి ఉత్సవాలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆయా ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. అధికసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. పలువురు భక్తులు ఉపవాస దీక్షలు, జాగరణ చేశారు. స్థానిక వీరభద్రస్వామి, వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేసి స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు.

గణపవరం: గణపవరం దుర్గాంబ సమేత సువర్ణేశ్వరస్వామి ఆలయం, స్థానిక బస్టాండ్ వద్ద భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయం, సరిపల్లె, అర్ధవరం, పిప్పర, కేశవరం, జల్లికాకినాడ గ్రామాల్లోని శివాలయాల వద్ద భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: పట్టణంలోని పాతూరు, జువ్వలపాలెం, కడకట్ల, మండలంలోని నవాబుపాలెం, కడియద్ద, కొండ్రుప్రోలు, కృష్ణాయపాలెం, కుంచనపల్లి, పెదతాడేపల్లి, మాధవరంలోని పురాతన శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. ఉదయం నుంచి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని కడియద్ద, నీలాద్రిపురం ఆలయాల్లో భారీ అన్నసమారాధనలు నిర్వహించారు.

పెంటపాడు: పెంటపాడు పార్వతీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు సూర్యనారాయణశర్మ స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కొవ్వూరి లక్ష్మణరెడ్డి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. బోడపాడు, అలంపురం, మీనవల్లూరు, పరిమెళ్ళ తదితర గ్రామాల్లోని శివాలయాల్లోను ప్రత్యేక పూజలు చేశారు.

అత్తిలి: అత్తిలిలోని సిద్ధేశ్వరస్వామిని మంత్రి కారుమూరితో పాటు భక్తులు పెద్దఎత్తున దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం మంత్రి అన్నసమారాధన ప్రారంభించారు. ఆలయ చైర్మన్ ఆకుల వెంకటనారాయణ, ఏఎంసీ చైర్మన్ భరణి ప్రసాద్, నాయకులు పైబోయిన సత్యనారాయణ, ఆర్. సూరిబాబు, ఆర్. సుజాత, మద్దాల శ్రీనివాస్, జి. సర్వేశ్వరరావు పాల్గొన్నారు.



కలశాలతో మహిళల ఊరేగింపు

పాలకొల్లు టౌన్: పాలకొల్లు లాకు దిగువ కొత్తపేటలో శ్రీభద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో శుక్రవారం శివరాత్రి ఘనంగా నిర్వహించారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా 210మంది మహిళలు కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. తంబూర, కేరళ డ్రమ్స్, సీసీ కోయి డ్యాన్స్‌లు, బుట్టబొమ్మలు గరగల నృత్యం తదితర మేళ తాళాలు, బాణసంచా కాల్పుల మధ్య ఊరేగింపు నిర్వహించారు. ఎమ్మెల్యే రామానాయుడు, మాజీఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ ఊరేగింపు ఉత్సవాన్ని సందర్శించారు. కమిటీ అధ్యక్షకార్యదర్శులు పట్టం గణేష్, మానెం బసవరాజు, బాసిన గుణ్నేశ్వరరావు, ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అగస్త్యేశ్వరస్వామి తెప్పోత్సవం

ఆకివీడు, మార్చి 8: ఆకివీడు వాడపల్లి వీధి ట్యాంకు సమీపంలో ఉన్న అగస్త్యేశ్వరస్వామికి శుక్రవారం తెప్పోత్సవం నిర్వహించారు. సుమారు రూ.90వేలు విలువల బాణ సంచా కాల్చారు.




తణుకులో ఆరిమిల్లి పాదయాత్ర.. ఆచంటలో విలేకరులతో మాట్లాడుతున్న పితాని.. కట్టుపాలెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నిమ్మల

ఆడ పిల్లలకు వరం 'కలలకు రెక్కలు': ఆరిమిల్లి

తణుకు, మార్చి 8: బాలికల జీవితాల్లో వెలుగులు నింపేందుకు టీడీపీ, జనసేన 'కలలకు రెక్కలు' అనే అద్భుతమైన పథకానికి శ్రీకారం చుట్టాయని మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శుక్రవారం సజ్జాపురం పాదయాత్రలో ఆయన మాట్లాడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటర్ పూర్తి చేసిన బాలికలు ఈ పథకానికి అర్హులని, కులం, మతం ప్రసక్తి లేకుండా ఎవ్వరైన దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇంటర్ పూర్తయిన తర్వాత దేశంలో ఎక్కడైనా ప్రొఫెషనల్ కోర్సులు చదివే బాలికలకు కోర్సుకు కావాల్సిన ఫీజు, బ్యాంకులు ఇచ్చే విద్యా రుణం కోసం తెలుగుదేశం, జనసేన ప్రభుత్వం ష్యూరిటీ ఇస్తుందని వివరించారు. రుణానికి వడ్డీ కూడా ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. ఈ సౌకర్యాన్ని ఉపయోగించు కునేందుకు కలలకు రెక్కలు డాట్ కాం వెబ్‌సైట్లో రిజిస్టర్ చేసుకోవాలని, 9261292612కు కాల్ చేసి రిజిస్ట్రేషన్ లింకు పొందవచ్చని తెలిపారు.

ఆచంట: ఏ ఆడబిడ్డ రాష్ట్రంలో చదువుకు సంబంధించి డబ్బులు కొరతతో ఇంటికే పరిమితం కాకూడదనే ఆలోచనతో కలలకు రెక్కలు పథకాన్ని టీడీపీ-జనసేన ప్రభుత్వం తీసుకొస్తుందని మాజీ మంత్రి పితాని తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విజయవంతంగా పూర్తి చేసిన మహిళలు ఈ పథకం కింద దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. వచ్చే జూన్‌లో ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం రిజిస్టర్ చేసుకున్న మహిళలు తమ సమీపంలోని నోటిఫైడ్ బ్యాంక్ వద్దకు వెళ్లి తరువాత ప్రక్రియను పూర్తి చేసుకోవాలన్నారు.

చంద్రబాబు పవన్ చిత్రపటాలకు పాలభిషేకం

పాలకొల్లు టౌన్, మార్చి 8: మంగళగిరిలో జరిగిన బీసీ జయహో సభలో బీసీ డిక్లరేషన్ ప్రకటించినందుకు కృతజ్ఞతలుగా పాలకొల్లులో శుక్రవారం ఎమ్మెల్యే రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి బోణం చినబాబు ఆధ్వర్యంలో టీడీపీ జనసేన బీసీ శ్రేణులు చంద్రబాబు పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలభిషేకం నిర్వహించారు.

నరసాపురం టౌన్: మహిళా సాధికారిత కోసం తెలుగుదేశం, జనసేన పార్టీలు రూపొందించిన కలలకు రెక్కల పథకం ఎంతో అద్భుతమైందని మహిళా కమిషన్ మాజీ సభ్యులు డాక్టర్ రాజ్యలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని టీడీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో కలలకు రెక్కలు పథకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

నియోజకవర్గ ప్రజలే నా కుటుంబం: ఎమ్మెల్యే నిమ్మల

యలమంచిలి, మార్చి 8: పాలకొల్లు నియోజకవర్గ ప్రజలే నా కుటుంబం అని ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు అన్నారు. కట్టుపాలెం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన బూత్‌కమిటీ సభ్యులు, ముఖ్యనాయకుల సమావేశంలో ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు మాట్లాడారు. ఎల్లప్పుడూ నా నియోజకవర్గ ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధి కోసమే పనిచేశానని అన్నారు. కొవిడ్, వరదలు సమయాల్లో ప్రజలకు తోడుగా.. అండగా నిలిచానని.. భవిష్యత్తులో కూడా ప్రజలతో మమేకమై పనిచేస్తానని చెప్పారు. రానున్న టీడీపీ-జనసేన కూటమి ప్రభుత్వంలోఅసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులన్నింటినీ పూర్తిచేస్తానని అన్నారు.

పోడూరు: రాబోయే టీడీపీ జనసేన కూటమి ప్రభుత్వంలో పాలకొల్లు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తానని ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు అన్నారు. పెనుమదం శివారు చిట్టితగుంటలో శుక్రవారం టీడీపీ, జనసేన శ్రేణులతో కలిసి ఆయన ఇంటింటి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో తాగునీటి పథకం కింద రూ.69కోట్లు నిధులు మంజూరయ్యాయని దురదృష్టవశాత్తు ప్రభుత్వం మారడంతో ఈ తాగునీటి పథకం పనులు సాగలేదన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు పెన్మెత్స రామభద్ర రాజు, నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకుడు తంగెళ్ల సత్యనారాయణ, గ్రామటీడీపీ అధ్యక్షుడు కడలి ఆంజనేయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నిమ్మల సతీమణి ఇంటింటా ప్రచారం

యలమంచిలి, మార్చి 8: టీడీపీ- జనసేన కూటమి అధికారంలోకి వస్తే ఆడబిడ్డ నిధి ద్వారా 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 చొప్పున ఏడాదికి రూ.18వేలు లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు సతీమణి సూర్యకుమారి తెలిపారు. మన పాలకొల్లు- మన రామానాయుడు ఇంటింటా పాదయాత్ర కార్యక్రమంలో భాగంగా చింతదిబ్బ గ్రామంలో నిమ్మల సూర్యకుమారి ప్రచారం నిర్వహించారు.

ఇఫ్కో డెలిగేట్ వెంకటస్వామి ఏకగ్రీవ ఎన్నిక

భీమవరం మార్చి 8: ఇఫ్కో రీజనల్ జనరల్‌బాడీ (ఆర్జీబి) డెలిగేట్‌గా డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సమీపంలోని బొమ్మూరు డీసీఎస్ భవనంలో ఈ ఎన్నిక జరిగింది. రీజనల్ బాడీ ఎన్నికలలో తనను సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వెంకటస్వామి తెలిపారు. రైతుగా డీసీఎంఎస్ చైర్మన్‌గా చేస్తున్న సేవలను గుర్తించి ఇఫ్కో సంస్థ డెలిగేట్‌గా గౌరవించిందని ఆయన అన్నారు. రైతులకు అన్ని రకాలుగా మెరుగైన సేవలు అందేలా కృషి చేస్తానని ఆయన తెలిపారు.

ఓహెచ్‌ఆర్ ప్రారంభం

భీమవరం రూరల్, మార్చి 8 : పట్టణంలో రెండు పూటలా తాగునీరు అందేలా తాగునీటి సరఫరా అభివృద్ధి పనులు చేయడం జరిగిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం నాడు పట్టణంలోని 4వ వార్డులో ఓహెచ్‌ఆర్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, పబ్లిక్ హెల్త్ డీఈ ఆర్ విజయ్, ఏపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మేడిది జాన్సన్, పార్టీ పట్టణ అధ్యక్షుడు తోట భోగయ్య తదితర వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

సీసీ రహదారులకు భూమి పూజ


జంగాలకాలనీలో సీసీ రహదారికి భూమిపూజ చేస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు

ఉండి, మార్చి 8: జంగాలకాలనీలో సీసీ రహదారులకు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇందుకూరి హరిబాబు, సర్పంచ్ కమతం సౌజన్య, ఎంపీటీసీ గిరడ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

24న పాలకొల్లు టౌన్ హాల్ ఎన్నికలు

పాలకొల్లు రూరల్, మార్చి 8: పాలకొల్లు శ్రీమామిడి చిన వెంకట శివయ్య మెమోరియల్ టౌన్ హాల్ ఎన్నికలు ఈనెల 24న ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి పీడీఎస్‌వీ బాల ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. సభ్యులందరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాల్సిందిగా కోరారు. ఓటు వేసేందుకు ప్రభుత్వ గుర్తింపు కార్డు గానీ, ఆధార్ కార్డు గానీ, డ్రైవింగ్ లైసెన్స్ గానీ తీసుకొనిరావాలని ప్రకటనలో పేర్కొన్నారు

ప్రకటన
మహారాజశ్రీ 3వ అదనపు జిల్లా జడ్జి, భీమవరం వారి కోర్టులో

O.S. No. 40/2023

Between :
ముచ్చి గోవర్ధని .... వాది
మరియు
ముచ్చి శ్రీజ రాణీ మరియు వగైరాలు .... ప్రతివాదులు

1వ ప్రతివాది
కుమారి ముచ్చి శ్రీజరాణి, D/o లేట్. శ్రీనివాసరావు, డోర్ నెం.13-2-23, సిగిడీల వారి వీధి, గునుపూడి, భీమవరం, భీమవరం మండలం, పశ్చిమగోదావరి జిల్లా.

2వ ప్రతివాది
ముచ్చిఫణి, S/o లేట్. శ్రీనివాసరావు, డోర్ నెం.13-2-23, సిగిడీల వారి వీధి, గునుపూడి, భీమవరం, భీమవరం మండలం, పశ్చిమగోదావరి జిల్లా.

పై నెంబరు గ్రంథంలో 1వ ప్రతివాది అయిన కుమారి ముచ్చి శ్రీజరాణి మరియు 2వ ప్రతివాది అయిన ముచ్చిఫణి గార్లు శ్రీయుత కోర్టు వారి ద్వారాను మరియు రిజిష్టరు పోస్టు ద్వారాను సమన్లు పంపినను తీసుకొనక, అందుకొనక కాలయాపన చేయుచున్నారని దానిపై శ్రీయుత కోర్టు వారు పేపరు ప్రకటన అనుమతి మంజూరు చేసియున్నారు. శ్రీయుత కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం ది.25-03-2024 తేదీకి వాయిదా అయియున్నది. కావున 1వ ప్రతివాది అయిన కుమారి ముచ్చి శ్రీజరాణి మరియు 2వ ప్రతివాది అయిన ముచ్చి ఫణి గార్లు ది.25.03.2024 ఉదయ 10-30 ని.లకు తమ అభ్యంతరములు స్వయంగా గాని, తమ అడ్వకేట్ గారి ద్వారా గాని శ్రీయుత కోర్టు వారి ఎదుట హాజరై తమ ఆక్షేపణలు తెలియ చేసుకొనవలెను. లేని యెడల సదరు 1వ ప్రతివాది అయిన కుమారి ముచ్చి శ్రీజరాణి మరియు 2వ ప్రతివాది అయిన ముచ్చి ఫణి గార్లను పరోక్షమున తీర్మానించబడును అని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

అల్లూరి వెంకటేశ్వరరాజు
వాది తరపు అడ్వకేట్
సెల్: 98482 11102

ప్రదేశం: భీమవరం
తేది: 03.03.2024


శశి ఇంజనీరింగ్ కళాశాలలో మహిళా దినోత్సవంలో మిస్ ఇండియా ఎర్త్


గొరగనమూడిలో కేక్ కట్ చేసిన సచివాలయ, వైద్య సిబ్బంది

ఘనంగా మహిళా దినోత్సవం

మహిళలకు సన్మానం.. కేక్ కట్ చేసిన మహిళలు

ఆకివీడు, మార్చి 8: మహిళా దినోత్సవం సందర్భంగా డ్వాక్రా మహిళలను స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఏ దేశానికైనా స్త్రీ అభ్యుదయమే ప్రగతికి సంకేతమని వక్తలు అన్నారు. నగర పంచాయతీ, మెప్మా చైర్మన్లు జామి హైమావతి, మోరా జ్యోతిరెడ్డి పాల్గొన్నారు.

పాలకోడేరు: గొరగనమూడి గ్రామంలోని హెల్త్ సెంటర్లో వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు.

తణుకు: ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సీపీఐ కార్యాలయంలో మహిళలను సత్కరించారు. మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి తదితరులు పాల్గొన్నారు. ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల, ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ప్రిన్సిపాల్ కరుటూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉండి: ఉండిలోని గుండాబత్తుల సుబ్బారావు ఆధ్వర్యంలో మండలంలోని ఆయా శాఖలలో ఉత్తమ సేవలు అందించిన మహిళలను గుర్తించి వారిని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు సత్కరించారు.

గణపవరం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గణపవరం చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. 2023-24 విద్యాసంవత్సరానికి బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో ప్రథమస్థానం సాధించిన విద్యార్థుల తల్లులను ఘనంగా సత్కరించారు. అనంతరం విద్యార్థులకు పలు పోటీల్లో నిర్వహించి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ నిర్మలకుమారి, వైస్ ప్రిన్సిపాల్ మధురాజు, అధ్యాపకులు పాల్గొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 30మంది వైద్యఆరోగ్య మహిళా ఉద్యోగులను వైద్యాధికారులు సంతోష్‌నాయుడు, కిరణ్మయి ఘనంగా సత్కరించారు. ఎంపీహెచ్‌వో విల్సన్‌బాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: ప్రతి ఒక్కరూ తమ ఓటముల నుంచి నేర్చుకున్న పాఠాల వల్లే ఉత్తమ స్థానాలకు ఎదగగలరని మిస్ ఇండియా యర్త్ డాక్టర్ తేజస్విని మనోజ్ఞ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం శశి ఇంజనీరింగ్ కళాశాలలో కరస్పాండెంట్, సెక్రటరీ మేకా క్రాంతి సుధ అధ్యక్షతన మహిళా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మహ్మద్ ఇస్మాయిల్, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

● తాడేపల్లిగూడెం మున్సిపాలిటీలో ఉత్తమ సేవలు అందించిన మహిళా పారిశుధ్య కార్మికులను లయన్స్ క్లబ్ ఆఫ్ స్పిరిట్ అధ్యక్షురాలు నూకల జయభారతి ఆధ్వర్యంలో సత్కరించారు.